కేంద్ర పథకాలను పకడ్బందీగా అమలు చేయాలి

దివ్యాంగులకు బ్యాటరీ వాహనాలు ఇచ్చేందుకు చర్యలు

అవసరమైన ప్రాంతాల్లో జిన్నింగ్ మిల్లుల ఏర్పాటు

దిశ కమిటీ సమావేశంలో ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి

మాట్లాడుతున్న ఎంపీ రఘురాంరెడ్డి, హాజరైన ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఇతర అధికారులు

ఖమ్మం, అక్టోబర్ 22: కేంద్ర ప్రాయోజిత పథకాల ద్వారా జిల్లా ప్రజలు లబ్ధి పొందేలా అధికారులు పని చేయాలని ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి సూచించారు. 'కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలు – రాబోయే 3 నెలల కాలంలో నిర్దేశించుకున్న లక్ష్యాలు' తదితర అంశాలపై ఖమ్మం కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సీపీ సునీల్‌దత్, అదనపు కలెక్టర్ శ్రీజ, ఎమ్మెల్యేలు రాగమయి, రాందాస్‌నాయక్‌లతో కలిసి ఆయన చర్చించారు. జిల్లా సంక్షేమ, పరిశ్రమలు, జిల్లా పౌర సరఫరాలు, గ్రామీణ అభివృద్ధి, హౌసింగ్, విద్య, వైద్యం, వ్యవసాయం, విద్యుత్, పురపాలక, జాతీయ రహదారులు తదితర శాఖల అధికారులు తమ నివేదికలను సమావేశంలో వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. అవసరం, అర్హత ఉన్న దివ్యాంగులకు బ్యాటరీ ఆధారిత వాహనాలను అందించేందుకు కేంద్ర అధికారులను సమన్వయం చేసుకొని శిబిరాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో పత్తి పంట అధికంగా పండుతున్నందున అవసరమైన ప్రాంతాల్లో జిన్నింగ్ మిల్లుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సత్తుపల్లిలో మంజూరైన ఆసుపత్రులను సకాలంలో పూర్తి చేయని కాంట్రాక్టర్లపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఇథనాల్ ఫ్యాక్టరీ, పామాయిల్ ఫ్యాక్టరీ, రైస్ మిల్లర్ల క్లస్టర్లు, పౌల్ట్రీ, కారం తయారీ కేంద్రం తదితర పరిశ్రమల ఏర్పాటుకు జిల్లాలో మంచి అవకాశాలు ఉన్నాయని వివరించారు. సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ.. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న హెచ్‌ఎంకు అనుకూలంగా రిపోర్ట్ తయారు చేసి సస్పెన్షన్‌కు గురైన హెచ్‌ఎంకు అదే పాఠశాలలో ఎలా పోస్టింగ్ ఇచ్చారని అధికారులను ప్రశ్నించారు. ఫిర్యాదు చేసిన తన అభిప్రాయం అడగకుండా విచారణ రిపోర్టు ఎలా రూపొందించారని ప్రశ్నించారు. వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ.. వైరా బ్రిడ్జిపై ప్రమాదాలు అధికంగా జరుగుతున్నందున దాని మరమ్మత్తు పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కోరారు. కేఎంసీ కమిషనర్ అభిషేక్, శిక్షణ సహాయ కలెక్టర్ మృణాల్, ఇతర అధికారులు సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, దీక్షా రైనా, సన్యాసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ దుకాణాలకు ఆన్‌లైన్‌లో టెండర్లకు ఆహ్వానం

ఖమ్మం, అక్టోబర్ 22: ఆర్టీసీ ఉమ్మడి ఖమ్మం జిల్లా రీజియన్‌లోని ఖమ్మం, మధిర, సత్తుపల్లి, భద్రాచలం, కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు డిపోల పరిధిలో ఉన్న వాణిజ్య దుకాణాలకు ఆన్‌లైన్ విధానంలో టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఆపరేషన్స్) జీఎన్ పవిత్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు మంగళవారం నుంచి నవంబర్ 6 వరకు అధికారిక వెబ్‌సైట్ tgsrtc.telanagana.gov.in (tenders)లో టెండర్ వేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9963507506 నంబరులో సంప్రదించాలని కోరారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతు

వెంకటేశ్వరరావు (ఫైల్)

ఎర్రుపాలెం, అక్టోబర్ 22 : మండల పరిధిలోని రాజులదేవరపాడు గ్రామానికి చెందిన గంతాల వెంకటేశ్వరరావు (30) మంగళవారం ఉదయం చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు కట్టలేరులో కొట్టుకుపోయాడు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై పి.వెంకటేష్ రెస్క్యూటీంతో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం రాత్రి వరకు వ్యక్తి ఆచూకీ లభించలేదు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్

వైరాటౌన్, అక్టోబర్ 22 : వైరాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ చేతుల మీదుగా 33 కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, 33 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. తహసీల్దార్ శ్రీనివాసరావు, బొర్రా రాజశేఖర్, వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, రంగారావు, రోశయ్య పాల్గొన్నారు.

ఖమ్మంలో పాఠశాలలను తనిఖీ చేసిన ఏఎంవో

విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఏఎంవో

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 22: నగరంలోని బాలాజీనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ పాఠశాలలను అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ (ఏఎంవో) కేశవపట్నం రవికుమార్ మంగళవారం తనిఖీ చేశారు. సమ్మెటివ్ అసెస్‌మెంట్ పరీక్ష నిర్వహణను పరిశీలించారు. పరీక్ష ముగిసిన విద్యార్థులను విషయోపాధ్యాయుడి పర్యవేక్షణలో తదుపరి పరీక్షకు సన్నద్ధం చేయాలని సూచించారు. నిర్దేశించిన గడువులోపు పరీక్ష పత్రాలను మూల్యాంకనం చేసి ఫలితాలను విశ్లేషించుకోవాలని ఆదేశించారు. టెన్త్ విద్యార్థుల స్థాయిని పరిశీలించి పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. హెచ్‌ఎం అజిత, జయలలిత పాల్గొన్నారు.

3న సకల ఉద్యోగుల వన సమారాధన


గాయపడిన ఉద్యోగికి విరాళాన్ని అందిస్తున్న సహోద్యోగులు

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 22: టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో నవంబర్ 3న ఖమ్మంలో సకల ఉద్యోగుల వన సమారాధన నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కొప్పిశెట్టి సురేశ్ మంగళవారం తెలిపారు. ఉద్యోగుల ఐక్యతను చాటుతూ ఉద్యోగులు విరాళాన్ని అందించారని పేర్కొన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన కృష్ణార్జునరావును పరామర్శించారు. సంఘం నాయకులు కస్తాల సత్యనారాయణ, వేలాద్రి, శేషుకుమార్, కొణిదెల శ్రీనివాస్, వినోద్‌బాబు, పోలూరి మురళీకృష్ణ, కంచర్ల శ్రీకాంత్, భాస్కర్, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ధాన్యం సరఫరా చేస్తే సీజ్‌చేస్తాం


సిబ్బందికి సూచనలు చేస్తున్న రామచంద్రరావు

బోనకల్లు, అక్టోబర్ 22 : అంతర్‌రాష్ట్రాల నుంచి ధాన్యాన్ని తెలంగాణ రాష్ట్రంలోకి తరలిస్తే వాహనాన్ని సీజ్ చేసి తగిన చర్యలు తీసుకుంటామని మధిర సివిల్‌సప్లై డిప్యూటీ తహసీల్దార్ రామచంద్రరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ చెక్‌పోస్టు వద్ద తనిఖీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆంధ్రాలోని ధాన్యం పండించిన రైతులు తెలంగాణలో అమ్ముకునేందుకు వచ్చేవారిని నియంత్రించేందుకు ఈ చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బోనకల్లు, చొప్పకట్లపాలెం సరిహద్దు ప్రాంతంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. తహసీల్దార్ అనిశెట్టి పున్నంచందర్, ఎస్సై మధుబాబు, ఏఈవోలు, సివిల్ సప్లై సిబ్బంది పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్స్ అయిన శ్రీ ఎడెల్లి భిక్షం, తండ్రి: రామయ్య, వయస్సు: 47 సం॥, వృత్తి: వ్యాపారం, నివాసం: రాజీవ్ నగర్ గుట్ట, U.P.H. కాలనీ, ఖమ్మం. బంటు రాజీవ్, తండ్రి: భిక్షమయ్య, వయస్సు: 43 సం॥, వృత్తి: వ్యాపారం, నివాసం: U.P.H. కాలనీ, ఖమ్మం సిటీ & జిల్లా గారు శ్రీమతి అందోల్ శ్రీలత అలియాస్ పసునూటి శ్రీలత, భర్త: రవికుమార్, వయస్సు: 50 సం॥, వృత్తి: గృహిణి, నివాసం: V.D.O. కాలనీ, ఖమ్మం జిల్లా గారి స్వాధీన హక్కు భుక్తములలో ఉన్నటువంటి ఈ క్రింద తెలుపబడిన ఖాళీస్థలంను నా క్లయింట్స్ కొనుగోలు చేయుటకు అంగీకరించి కొంత ధనమును బయానాగా చెల్లించినారు. కావున, ఇట్టి షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఏమైనా అభ్యంతర, ఆక్షేపణలు ఉన్నయెడల ఈ క్రింది ప్రకటన వెలువడిన 3 రోజులలోపు ఈ క్రింది సెల్ నెంబర్‌కు తెలియజేయగలరు. ఆ తరువాత వచ్చు ఎట్టి అభ్యంతర, ఆక్షేపణలు అన్నియూ చెల్లనేరవు. తదుపరి నా క్లయింట్ రిజిస్ట్రేషన్ చేయించుకొనగలరు.

షెడ్యూల్ ఆస్తి: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోగల ఖానాపురం హవేలి సర్వే నెం. 302, 317, 318, ప్లాట్ నెం. 39 గల ఇట్టి స్థిరాస్తికి **హద్దులు: తూర్పు:** 30 అడుగుల రోడ్, **పడమర:** ప్లాట్ నెం. 28, 30, **ఉత్తరం:** ప్లాట్ నెం. 40, **దక్షిణం:** ప్లాట్ నెం. 38.

బొడ్డు ఉపేందర్, న్యాయవాది
ఖమ్మం, **సెల్: 9440677971.**

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **మధిర బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **కర్నాటి నరేష్**, తండ్రి: **వెంకటేశ్వరరావు @ వెంకటేశ్వర్లు, వయస్సు** : 30 సం॥లు, **నివాసం** : మల్లారం, మధిర మండలం, ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లెయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి **3** రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి : ఖమ్మం జిల్లా, మధిర సబ్ రిజిస్ట్రారు వారి పరిధి, మధిర మండలం, మల్లారం గ్రామ పంచాయితీ, మల్లారం గ్రామములో గల 470.98 చ॥గజములు విస్తీర్ణముగా గల స్థిరాస్తి స్థలము, మరియు ఇట్టి స్థలములో గల ఇ.నెం. 2-33 (అసెస్మెంట్ నెం. 132)గా గల ఇంటి యొక్క ఆర్.సి.సి. కట్టుబడి విస్తీర్ణము 563.81 చ.అడుగులు, టాయ్‌లెట్స్ యొక్క ఆర్.సి.సి. కట్టుబడి విస్తీర్ణము. 64.72 చ.అడుగులు, ఇట్టి ఇంటికి గల కట్టుబడులు, వగైరాలతో సహా **డాక్యుమెంట్ నెం. : 2762/2024** గల ఆస్తికి హద్దులు : **తూర్పు** : గ్రామ పంచాయితీ రోడ్డు, **పడమర** : ఎమ్.నాని గారి భూమి. **ఉత్తరం** : నా తాలూకు స్థలము (గిఫ్టు ఇచ్చిన వారి స్థలం) **దక్షిణం** : కె.శ్రీను గారి ఇల్లు.

జి.హరేందర్ రెడ్డి
అడ్వకేట్, ఖమ్మం.
సెల్ : 9848022542

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **మధిర బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **మహమ్మద్ తౌసిఫ్‌పాషా, S/O. యం.డి.రఫిక్ పాషా, వయస్సు** : 22 సం॥లు, **వృత్తి** : వ్యాపారం, **నివాసం** : ఇ.నెం. 8-3-18, నిజాంపేట్, ఖమ్మం నగరం, ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లెయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి **5** రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి : ఖమ్మం రిజిస్ట్రేషన్ జిల్లా మరియు ఖమ్మం రూరల్ సబ్ రిజిస్ట్రార్ వారి అధికార పరిధిలో, ఖమ్మం జిల్లా ప్రజా పరిషత్, ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని, బల్లేపల్లి సర్వే నెం. 56 మిం.లే., ఖాళీ స్థలము ప్లాటు నెం. 21 పార్ట్, గల విస్తీర్ణము. 201-91 చ॥గ॥ లేక తత్సమానం 168-81 చ॥మీ॥లు, **డాక్యుమెంట్ నెం. : 1950/2016** గల స్థిరాస్తికి హద్దులు : **తూర్పు** : 100 అడుగుల వెడల్పు గల ఖమ్మం నుండి ఇల్లందు వెళ్ళు ఆర్ అండ్ బి రోడ్డు, **పడమర** : ప్లాటు నెం. 22 పార్ట్, **ఉత్తరం** : ప్లాటు నెం. 21, **దక్షిణం** : ఇతరుల భూమి.

జి.హరేందర్ రెడ్డి
అడ్వకేట్, ఖమ్మం.
సెల్ : 9848022542

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

PLOT FOR SALE

★**గజం: 2,500/- నార్కెట్‌పల్లి దగ్గర** గేటెడ్ కమ్యూనిటీ వెంచర్‌లో స్విమ్మింగ్ పూల్, కాటేజ్, 30 పండ్ల మొక్కలు, 30 ఎర్రచందనం మొక్కలతో 5 & 10 గుంటల ప్లాట్స్ అమ్మబడును. దసరా ఆఫర్ 10 గ్రా. గోల్డ్ కలదు. 7569587521.
NT-338783

డాక్యుమెంట్లు పోయినవి

నేను, అనగా అందోల్ శ్రీలత అలియాస్ పసునుటి శ్రీలత, భర్త: రవికుమార్, వయస్సు: 50 సం॥, వృత్తి: గృహిణి, నివాసం: ఇం.నెం. 6-1-193, V.D.O. కాలనీ, ఖమ్మం జిల్లా. మా అమ్మగారైన పసునుటి పుల్లమ్మగారి దస్తావేజు నెం. 3628/1982 కలిగిన చేతిసంచి తేది: 19-10-2024న మధ్యాహ్నం 12.00 గం॥ సమయంలో ఖమ్మం, ఖానాపురం ఆర్చి సమీపంలో ఆటోలో వెళుతుండగా పొరపాటున క్రింద జారి పడిపోయినది. అట్టి చేతిసంచి ఎంత వెతికినా దొరకలేదు. కావున, పైన తెలిపిన డాక్యుమెంట్లు ఎవరికైనా దొరికితే ఈ క్రింది ఫోన్ నెంబర్‌కు తెలియజేయగలరు. అందోల్ శ్రీలత, ఖమ్మం జిల్లా:
9059485915

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు
అత్యధిక ప్రచారం

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

'తోటల సంరక్షణపై అప్రమత్తంగా ఉండాలి'

ఖమ్మం వ్యవసాయం, అక్టోబర్ 21: జిల్లాలో పండ్ల తోటలు, మిరప, ఆయిల్‌పామ్ తోటల సంరక్షణ పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి ఎంవీ మధుసుదన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మామిడి, జామ, సీతాఫలం, అరటి, నిమ్మ, బొప్పాయి వంటి పండ్ల తోటల్లో జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

రేపు 'దుబాయ్ బైక్ రైడ్' నమోదు

ఖమ్మం, అక్టోబర్ 22: 'దుబాయ్ బైక్ రైడ్ ఎన్‌రోల్‌మెంట్' కార్యక్రమాన్ని ఖమ్మం టేకులపల్లిలోని మోడల్ కెరీర్ సెంటర్ గవర్నమెంట్ ఐటీఐలో ఈ నెల 24న నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి మాధవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు సంబంధిత సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. దుబాయ్ (యూఏఈ)లో బైక్ రైడర్స్ డెలివరీ బాయ్స్‌కి అధిక డిమాండ్ ఉందని, ఆకర్షణీయమైన వేతన ప్యాకేజీతో ఈ ఉద్యోగాలు ఉంటాయని, సురక్షితమైన, చట్టబద్ధమైన వలస మార్గాల ద్వారా ఈ రిక్రూట్‌మెంట్ జరుగుతుందని తెలిపారు. వివరాల కోసం www.tomcom.telangana.gov.in ని గానీ లేదా 9440049861, 9440050951, 9440051452 నంబర్లను గానీ సంప్రదించాలని సూచించారు.

ప్రజలకు సంపూర్ణ ఆరోగ్య సేవలు అందించాలి

మధిర రూరల్, అక్టోబర్ 22 : మండలంలోని గ్రామాల ప్రజలకు సంపూర్ణ ఆరోగ్య సేవలు అందించాలని మండల వైద్యాధికారి డాక్టర్ పృధ్వీ రాజ్‌నాయక్ సూచించారు. మంగళవారం దెందుకూరు పీహెచ్‌సీ పరిధిలోని పారా మెడికల్ సిబ్బంది, ఆశ కార్యకర్తలకు ఇంటింటి ఆరోగ్య సర్వేపై అవగాహన కల్పించి సర్వే రికార్డులను అందజేశారు. సంపూర్ణ ఆరోగ్య సేవల వివరాలను తప్పనిసరిగా రికార్డులో నమోదు చేయాలని వివరించారు.

విద్యార్థులు మంచి ప్రవర్తనతో మెలగాలి

మధిర రూరల్, అక్టోబర్ 22 : విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో చదివి బంగారు భవిష్యత్‌ను తీర్చుదిద్దుకోవాలని మహాత్మా జ్యోతిరావుపూలే బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రావణి సూచించారు. మంగళవారం పాఠశాలలో పిల్లల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. హ్యూమన్ రైట్స్ సభ్యులు కోట వెంకట్, కన్నెపోగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని, విద్యార్థులను సంస్కారవంతులుగా తీర్చిదిద్దే బాధ్యత గురువులదేనన్నారు.

'మా భూములకు రక్షణ కల్పించాలి'

చింతకాని, అక్టోబర్ 22 : ఎన్నో సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న తమ భూములకు రక్షణ కల్పించాలంటూ అనంతసాగర్ గ్రామానికి చెందిన మహిళా రైతులు కనపర్తి రంగనాయకమ్మ, బోయపాటి సీతారావమ్మ తహసీల్దార్ అనంతరాజు, ఎస్సై నాగుల్‌మీరాకు వినతిపత్రాలు అందించారు.

గాంధీనగర్‌లో సెల్‌టవర్‌ను నిర్మించొద్దు..

చింతకాని, అక్టోబర్ 22 : మండల పరిధిలో గాంధీనగర్ గ్రామంలో ఓ కార్పొరేట్ సంస్థకు చెందిన సెల్‌టవర్ నిర్మాణం చేపట్టవద్దని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. సదరు గ్రామ ప్రజలు జిల్లా ఉన్నతాధికారులకు ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా తహసీల్దార్ అనంతరాజు, ఎంపీడీవో రేబెల్లి రామయ్య మంగళవారం గాంధీనగర్ గ్రామంలో ప్రజాభిప్రాయాలు సేకరించారు. జనావాసాల మధ్య సెల్‌టవర్లు నిర్మిస్తే తమ ఆరోగ్యం దెబ్బతింటుందని గ్రామస్తులు సదరు అధికారులకు విన్నవించుకున్నారు.

ఇందిరమ్మ కమిటీలు పారదర్శకంగా ఉండాలి

చింతకాని, సెప్టెంబర్ 28: రాజకీయపార్టీలకు అతీతంగా రాష్ట్ర ప్రభుత్వం వేస్తున్న ఇందిరమ్మ కమిటీలు ఉండాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం చింతకాని గ్రామంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామసభల ద్వారా అర్హులైన లబ్ధిదారులనే ఎంపిక చేయాలన్నారు.

కొనసాగుతున్న 'ఫార్మా' కౌన్సెలింగ్

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 22: బీ ఫార్మసీ, ఫార్మా డీ ప్రవేశాల కోసం ఖమ్మంలోని ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతోంది. రెండో రోజు మంగళవారం 395 మంది విద్యార్థులు వివిధ స్లాట్ల ద్వారా నమోదు చేసుకున్నారు. వీరిలో 380 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ జాకీరుల్లా తెలిపారు

కనీస వేతనం అమలు చేయాలి

సత్తుపల్లిటౌన్, అక్టోబర్ 22: మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని ఏపీఐటీయూ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకుడు నిమ్మటూరు రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం సత్తుపల్లిలో మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కనీస బీమా రూ.10 లక్షలు ఇవ్వాలని కోరారు. రామారావు, యోబు, మహదేవలక్ష్మి, రహీం, మున్నీసా, వెంకటలక్ష్మి, సీతబాయి, శ్రీలక్ష్మి, జరీనా, అనసూర్య పాల్గొన్నారు.

ధర్మయుద్ధ మహాసభను విజయవంతం చేయాలి

సత్తుపల్లిటౌన్, అక్టోబర్ 22 : ఖమ్మంలో ఈ నెల 25వ తేదీన జరిగే మాదిగల ధర్మయుద్ధ మహాసభకు మందకృష్ణమాదిగ హాజరవుతున్నారని, ఈ సభను విజయవంతం చేయాలని సత్తుపల్లి ఎంఆర్‌పీఎస్ మండల ఇన్‌చార్జి గొల్లమందల ముత్తారావు పిలుపునిచ్చారు. మంగళవారం సత్తుపల్లి పట్టణంలోని విశ్వశాంతి విద్యాలయంలో ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు నల్లంటి అశోక్ అధ్యక్షతన ఎంఆర్‌పీఎస్ నాయకుల సమావేశం నిర్వహించారు. గొల్లమూడి శ్రీనివాసరావు, లక్ష్మణ్, రాఘవ, దేవన్న, రాంబాబు, కొరయ్య, రమేష్ పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

కొణిజర్ల, అక్టోబర్ 22 : మండలంలోని లాలాపురం గ్రామ సమీపంలో ఉన్న ఎస్‌ఏఆర్ రైస్‌మిల్ ఎదుట రైతుసంఘం ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేస్తున్నట్లు రైతు సంఘం మండల బాధ్యుడు దొడ్డపునేని కృష్ణార్జున్ రావు పేర్కొన్నారు. ఇటీవల ఎస్‌ఏఆర్ రైస్‌మిల్లులో 82 కోట్ల రూపాయల ధాన్యం కుంభకోణం జరిగిన విషయం అందరికీ తెలిసిందే. రైస్‌మిల్లును వెంటనే సీజ్ చేయాలనే డిమాండ్‌తో ధర్నా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

పేదలకు చీరెల పంపిణీ

కారేపల్లి, అక్టోబర్ 22 : మండల కేంద్రానికి చెందిన పలు పేద కుటుంబాల మహిళలకు బీఆర్‌ఎస్ మైనార్టీ విభాగం జిల్లా నాయకుడు షేక్ గౌసుద్దీన్ మంగళవారం దీపావళి కానుకగా చీరెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ పిలుపులో పేదలు తమ పండుగలను సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో తనవంతు సహకారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

పిడుగుపాటుతో తండ్రీకూతురు మృతి

కారేపల్లి(కామేపల్లి), అక్టోబర్ 22: పిడుగుపాటుతో తండ్రీకూతురు మృతి చెందిన ఘటన ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం అడవిమద్దులపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చింతల లింగస్వామి(50), అతడి భార్య, కూతురు కావేరి(18)తో కలిసి చేనులో పత్తి తీస్తున్నారు. ఈ క్రమంలో మధ్యాహ్నం సమయంలో ఆ ప్రాంతంలో ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురవడంతో పాటు పిడుగుపడింది. దీంతో తండ్రీకూతురు లింగస్వామి, కావేరి అక్కడికక్కడే మృతిచెందారు. లింగస్వామి భార్య శైలజకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన చుట్టుపక్కల రైతులు ఆమెను ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలానికి చేరుకొని పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. ఒకే కుటుంబంలో ఇద్దరు మృతిచెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

విద్యార్థిని ఆత్మహత్య

కూసుమంచి, అక్టోబర్ 22 : క్షణికావేశంలో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన కూసుమంచి మండలం గంగబండతండాలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వడ్త్యా చైతన్య(19) ఖమ్మంలోని ప్రైవేట్ కళాశాలలో హాస్టల్లో ఉండి డిగ్రీ చదువుతున్నది. దసరా సెలవులకు ఇంటికి వచ్చి తిరిగి హాస్టల్‌కు వెళ్లకపోవడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో క్షణికావేశంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

'ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి'

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 22: అంకితభావంతో పనిచేసి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు సూచించారు. పీఆర్టీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నగరంలోని సంఘం కార్యాలయంలో నూతన ఉపాధ్యాయులకు మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అలాగే, ఖమ్మం పరిసర ప్రాంత ఉపాధ్యాయులకు సర్వీస్ మేటర్స్‌పై అవగాహన కల్పించారు.

'దళితబంధు నిధులు వెంటనే విడుదల చేయాలి'

అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బొమ్మెర రామ్మూర్తి, నాయకులు

ఖమ్మం, అక్టోబర్ 22: దళితబంధు నిధులు మంజూరు చేసి వెంటనే లబ్ధిదారుల ఖాతాలో జమ చేయాలని బీఆర్‌ఎస్ నాయకుడు బొమ్మెర రామ్మూర్తి కోరారు. ఈ మేరకు పలువురు లబ్ధిదారులతో కలిసి మంగళవారం ఖమ్మం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. నెమలి కిశోర్, అరేంపుల వీరభద్రం, నేరెళ్ల, ఆరోన్, వెంకటేశ్, మాధవి, శివాజీ, చేకూరి సతీశ్, చేకూరి నరేశ్ పాల్గొన్నారు.

నాణ్యత, పరిశుభ్రతలో 'శేషాద్రి'కి ప్రథమ స్థానం

ఖమ్మం, అక్టోబర్ 22: నాణ్యత, పరిశుభ్రత, అమ్మకాలల్లో ఖమ్మం ఏదులాపురంలోని శ్రీశేషాద్రి ఫిల్లింగ్ స్టేషన్ మరోసారి కూడా ప్రథమ స్థానంలో నిలిచిందని హెచ్‌పీసీఎల్ జోనల్ హెడ్, జనరల్ మేనేజర్ బన్నీ తెలిపారు. 2023–24 సంవత్సరానికి గాను 11 జిల్లాల వరంగల్ రీజినల్‌లో ఈ స్టేషన్ ప్రథమ స్థానంలో నిలిచిందని, గడిచిన 20 ఏళ్లుగా కూడా ప్రథమ స్థానంలోనే నిలుస్తూ వస్తోందని వివరించారు. ఈ సందర్భంగా దాని నిర్వాహకుడు నాగబత్తిని రవిని బన్నీతోపాటు సీఆర్‌ఎం నఫ్సద్, సేల్స్ ఆఫీసర్ సమ్మయ్య సన్మానించారు.

వైరాలో కొవ్వొత్తుల ర్యాలీ

వైరాటౌన్, అక్టోబర్ 22 : పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వైరా మండల కేంద్రంలో మంగళవారం వైరా లయన్స్‌క్లబ్, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద పోలీస్ అమరవీరులను గుర్తు చేసుకుంటూ నివాళి అర్పించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చింతలపూడి వెంకటేశ్వరరావు, మీల్స్ ఆన్ వీల్స్ కోఆర్డినేటర్ చింతోజు నాగేశ్వరరావు, ఎస్సై భాగ్యరాజ్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ నిమిత్తం నిరంతరం కాపలా కాస్తుంటారని అన్నారు.

'అయోడిన్ లోప రుగ్మతల నివారణ'పై అవగాహన

రఘునాథపాలెం, అక్టోబర్ 22: ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని వీ వెంకటాయపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అధికారులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అసంక్రమిత వ్యాధుల నివారణ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రామారావు, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ వెంకటరమణ పాల్గొని వ్యాధి ప్రబలే విధానం, నివారణ చర్యల గురించి వివరించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పీహెచ్‌సీల పరిధిలోని ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

చేపల సొసైటీలకు చేప పిల్లల పంపిణీ

రఘునాథపాలెం, అక్టోబర్ 22: మత్స్య శాఖ ఆధ్వర్యంలో రఘునాథపాలెం మండలంలోని చేపల సొసైటీలకు ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమం జరిగింది. ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు మామిళ్ల వెంకటేశ్వర్లు పాల్గొని సొసైటీలకు అందజేశారు. సొసైటీ అధ్యక్షులు పందుల ఉపేందర్, డైరెక్టర్లు చిక్కుళ్ల రామయ్య, ముద్రబోయిన వెంకటేశ్, పందుల సత్యం, అక్కి సాయి, జింకల రవి, బద్రి, గోపాల్, శ్రీను, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

15వ బెటాలియన్‌లో రక్తదాన శిబిరం

సత్తుపల్లి, అక్టోబర్ 22 : మండల పరిధిలోని గంగారంలో 15వ ప్రత్యేక బెటాలియన్ వారి ఆధ్వర్యంలో పోలీస్ ఫ్లాగ్–2024 దినోత్సవంలో భాగంగా బెటాలియన్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. బెటాలియన్ సిబ్బంది, అధికారులు పాల్గొని రక్తదానం చేశారు. ముఖ్యఅతిథి బెటాలియన్ కమాండెంట్ పీజేపీసీ ఛటర్జీ మాట్లాడుతూ రక్తదానం వల్ల ఎందరో ప్రాణాలు కాపాడినట్లని అన్నారు. కార్యక్రమంలో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెండ్ ఎస్‌డీ రంగారావు, సత్తుపల్లి సీహెచ్‌సీ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వైద్యాధికారి పీ.రాజేష్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వేంసూరులో రైతుల ధర్నా

వేంసూరు, అక్టోబర్ 22 : గ్రీన్‌ఫీల్డ్ హైవేపై పనులు కొనసాగుతుండడంతో వరికోత మిషన్లు తమ పొలాల్లోకి వెళ్లడంలేదని స్థానిక రైతులు మంగళవారం ధర్నా చేశారు. తమ పంటలను ఇండ్లకు తీసుకొచ్చే మార్గం చూపే వరకు గ్రీన్‌ఫీల్డ్‌పై వాహనాలను తిరగనియ్యమని వేంసూరు రైతులు వాహనాలను అడ్డుకున్నారు. స్పందించిన కాంట్రాక్టర్ అధికారులతో మాట్లాడి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో విరమించారు. రైతులు రమేష్, చంటి, తదితరులు పాల్గొన్నారు.

మిరపలో వేరుకుళ్లుతో నష్టం

కూసుమంచి, అక్టోబర్ 22 : మిరప తోటలో వేరు కుళ్లు రావడం వల్ల తీవ్ర నష్టం వాటిల్లుతుందని, నివారణకు రైతులు తగిన చర్యలు తీసుకోవాలని ఉద్యానవన అధికారి అపర్ణ సూచించారు. మండల పరిధిలోని రావిచెట్టుతండాలో పలు మిర్చితోటలను మండల వ్యవసాయశాఖ అధికారి రామడుగు వాణితో కలిసి మంగళవారం పరిశీలించారు. వేరు కుళ్లు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. సీవోసీ లేదా ఏదైనా కాపర్ సంబంధించిన శిలీంద్రనషిణి ట్రైకో డర్మా విరిడే 3 కేజీల సూడోమోనస్ 3 కేజీలు, బెల్లం 5 కేజీలు, 200లీటర్ల నీటిలో కలిపి 3, 4రోజుల తరువాత మొక్కల పాదల్లో చల్లుకోవాలి. దీంతో వేరు కుళ్లు తగ్గుతుందని తెలిపారు.

పాఠశాలలను పరిశీలించిన ఎంపీడీవో

బోనకల్లు, అక్టోబర్ 22 : మండలంలోని ముష్టికుంట్ల, బోనకల్లు ప్రాథమిక పాఠశాలలను ఎంపీడీవో ఆర్.రమాదేవి ఎంఈవో దామాల పుల్లయ్యతో మంగళవారం కలిసి పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలు ఏర్పాటు చేసింది. ఈ కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. విద్యార్థులు ఇబ్బందులు గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వ్యక్తిపై కేసు నమోదు

చింతకాని, అక్టోబర్ 22 : మండలంలోని ఓ గ్రామానికి చెందిన వీరబాబుపై మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై షేక్ నాగుల్‌మీరా తెలిపిన వివరాల ప్రకారం... వీరబాబు అదే గ్రామానికి చెందిన వివాహితపై ఆదివారం రాత్రి ఇంట్లో చొరబడి లైంగికదాడికి యత్నించాడు. సదరు మహిళ కేకలు వేయగా అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేశారు.

ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబీకులకు గ్రాండ్‌హెల్త్ చాలెంజ్

మధిర, అక్టోబర్ 22 : మధిర డిపోలో గ్రాండ్‌హెల్త్ చాలెంజ్‌ను మంగళవారం డిపో మేనేజర్ డి.శంకర్‌రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమం మూడురోజుల వరకు కొనసాగుతుందని డిపో మేనేజర్ తెలిపారు. ఉద్యోగులు భార్య లేదా భర్త కూడా గ్రాండ్‌హెల్త్ చాలెంజ్‌లో పాల్గొని వారి ఆరోగ్య పరీక్షలన్నీ కూడా చేయించుకొని అందరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని కోరారు.

షార్ట్‌హ్యాండ్‌పై విద్యార్థులకు అవగాహన

పెనుబల్లి, అక్టోబర్ 22 : కల్లూరులోని ప్రతిభ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు షార్ట్‌హ్యాండ్‌పై ట్రైనర్ కోట సత్యనారాయణమూర్తి మంగళవారం అవగాహన కల్పించారు. ప్రభుత్వం ప్రకటించే అన్ని స్టెనోగ్రాఫర్, టైపిస్ట్ తదితర ఉద్యోగాలకు అర్హత సంపాదించి సుఖంగా జీవించాలన్నారు. షార్ట్‌హ్యాండ్ నేర్చుకోవడం వల్ల ఇంగ్లీష్‌లో రాయడం, మాట్లాడటం సులభతరమవుతుందన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

సత్తుపల్లిటౌన్, అక్టోబర్ 22 : జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ వారి పర్యవేక్షణలో తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ వారి సౌజన్యంతో సత్తుపల్లి పట్టణంలో బస్టాండ్ ఏరియా, ఎన్టీఆర్‌కాలనీ సెంటర్లలో పోలూరి రాము జనపద కళాబృందం పల్లెసుద్దుల కళారూపాయల ద్వారా హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై మంగళశారం అవగాహన కల్పించారు.

'భూమి లేని రైతులకు పరిహారం'

బోనకల్లు, అక్టోబర్ 22 : అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు పరిహారం అందించకుండా.. భూమి లేని వ్యక్తికి పరిహారం ఎలా అందించారని మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరావును రాపల్లె రైతులు నిలదీశారు. మంగళవారం మండలంలోని రాపల్లె, బోనకల్లు గ్రామాలకు చెందిన రైతులు మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల వ్యవసాయాధికారి వద్దకు చేరుకొని పంటనష్ట పరిహారం మంజూరైన వారి లిస్ట్‌ను ఇవ్వాలని కోరారు. తన వద్ద లిస్ట్ లేదని చెప్పడంతో వ్యవసాయాధికారిపై మండిపడ్డారు. పంటలు పోయి కొందరు బాధపడుతుంటే.. భూమి లేని రైతులకు పరిహారం ఎలా ఇచ్చారని అడిగారు. వ్యవసాయాధికారిపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.